సాక్షి
వికారాబాద్

గురువారం । 29 । ఆగస్టు । 2024



గ్రామీణం.. క్రీడలకు దూరం!

ప్రోత్సహించేవారు లేక గ్రామీణ ప్రాంత యువతి యువకులు క్రీడల వైపు కన్నెత్తి చూడటం లేదు.

8లో ▸



బాల్య వివాహాలు అరికట్టాలి

బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చీఫ్ అడ్వకేట్ వెంకటేశం పేర్కొన్నారు.

8లో ▸



ఓపెన్ విద్యతో ప్రయోజనం

పలు కారణాలతో చదువు మధ్యలో ఆపేసి.. మళ్లీ కొనసాగిద్దామనే వారికి ఓపెన్ స్కూల్ ఎంతో ఉపయోగపడుతుంది.

9లో ▸

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై దృష్టి సారించండి

ఎస్పీ నారాయణరెడ్డి



పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

మోమిన్‌పేట: సైబర్ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని ఎస్పీ నారాయణరెడ్డి పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. చెట్ల పెంపకం, రికార్డుల నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లాటరీ, బహుమతుల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారని తెలిపారు. కొత్త వ్యక్తులు ఫోన్లకు పంపే లింక్‌లను ఓపెన్ చేయరాదని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నంబరు లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇలాంటి వాహనాలపై వచ్చి దోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. నేర రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ అరవింద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పే స్కూల్ ప్రతిపాదనను విరమించుకోవాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రత్నం



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు

పరిగి: అంగన్‌వాడీ కేంద్రాలను ప్లే స్కూళ్లుగా మార్చి మూడో తరగతి వరకు క్లాసులు నిర్వహించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రత్నం డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సయ్యాద్ మల్కాపూర్, రాఘవాపూర్, ఖుదావన్‌పూర్, రావులపల్లి, రాపోల్, తొండుపల్లి పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడో తరగతి వరకు అంగన్‌వాడీలకు అప్పగించడం అంటే ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడమేనని అన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలను కల్పించాలని కోరారు. చాలా గ్రామాల్లో పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయని, ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితిలో నెలకొందన్నారు. బడుల బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటయ్య, మండల అధ్యక్షుడు దశరథ్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్య నాయక్



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

అనంతగిరి: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షలు కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు. 61 సంవత్సరాలు నిండిన వారికి రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు స్వప్న రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు శ్రీకారం

'నారాయణపేట - కొడంగల్' సామర్థ్యం పెంపు

- ప్రాజెక్టు కింద పది రిజర్వాయర్లు
- లక్ష ఎకరాలకు సాగునీరు
- నారాయణపేటకు తాగునీరు
- అంచనా వ్యయం రూ.4,350 కోట్లకు పెంపు
- మొదటి దశ టెండర్ల పిలుపు: రూ.2,260 కోట్లు



జూరాల ప్రాజెక్టు

కొడంగల్: నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద 10 రిజర్వాయర్లు నిర్మించాలని నిర్ణయించారు. కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లోని చెరువుల నీటి సామర్థ్యం పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి టెండర్లను పిలిచారు. త్వరలో పనులు ప్రారంభం కానుండటంతో కొడంగల్ నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో రైతన్నల దశ దిశ మారే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకం సామర్థ్యం పెంచారు. 2.1 టీఎంసీల నుంచి 4.022 టీఎంసీల వరకు నీటి నిల్వను పెంచడానికి వీలుగా చెరువులను అభివృద్ధి చేయనున్నారు. అంచనా వ్యయాన్ని రూ.2,945 కోట్ల నుంచి రూ.4,350 కోట్లకు పెంచారు. రెండు దశల్లో ఎత్తిపోతల పనులను పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగునీరు.. నారాయణపేట జిల్లాకు తాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాగు తాగునీటి అవసరాలను తీర్చే విధంగా ప్రాజెక్టు పనులకు రూప కల్పన చేశారు. గతంలో హెలికాప్టర్ ద్వారా లైడార్ సర్వే పూర్తి చేశారు. ఈ సర్వే ద్వారా కాలువల నిర్మాణం, ప్రెషర్ పైపుల నిర్మాణం కోసం భూగర్భ సర్వేను పూర్తి చేశారు. ఊట్కూరు, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి, లక్ష్మీపూర్, ఈర్లపల్లి, దౌల్తాబాద్, హస్నాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట ప్రాంతాల్లో రిజర్వాయర్లు నిర్మించనున్నారు.



నీటి నిల్వ సామర్థ్యం పెరగనున్న కొడంగల్ చెరువు

ఆయకట్టు వివరాలు

కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీరు, నారాయణపేటకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ పథకానికి రూపకల్పన చేశారు. మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూర్, మక్తల్ మండలాల్లో 25,786 ఎకరాలకు, నారాయణపేట నియోజకవర్గంలోని నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద మండలాల్లో 20,472 ఎకరాలకు, కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల, కోస్గి, గుండుమాల్, మద్దూరు, కొత్తపల్లి మండలాల్లో 53,745 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు.

రెండు దశల్లో పనులు

ఈ ప్రాజెక్టు పనులను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. ముందుగా భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకుంటారు. మొదటి దశలో బూత్పూర్ జలాశయం నుంచి కానుకుర్తి వరకు నీటిని ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి జయమ్మ చెరువు.. అక్కడి నుంచి కానుకుర్తి చెరువుకు నీళ్లను మళ్లిస్తారు. ఇందుకోసం ఊట్కూరు, జయమ్మ చెరువు, కానుకుర్తి చెరువులను ఆధునీకరించి నీటి నిల్వ సామర్థ్యం పెంచుతారు. రెండో దశలో జాజాపూర్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, హస్నాబాద్, కొడంగల్ చెరువులను ఆధునీకరిస్తారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచుతారు. గ్రావిటీ కాలువలు, డిస్ట్రిబ్యూషన్ కాల్వలను నిర్మిస్తారు. అక్కడి నుంచి పంట పొలాలకు సాగు నీటిని అందిస్తారు.



కొత్త గడి గురుకులాన్ని పరిశీలించిన అలుగు వర్షిణి, ప్రతీక్‌జైన్ తదితరులు

ఉన్నత స్థానంలో నిలవాలి

- టీజీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి
- కొత్తగడి గురుకులాన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ

అనంతగిరి: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(టీజీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. బుధవారం జిల్లాలోని కొత్తగడి ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటగది, స్టోర్ రూమ్, విద్యార్థుల విశ్రాంతి గదులను, హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, నిల్వలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగారు. భోజనం తిని బాగుందని కితాబు ఇచ్చారు. పిల్లల గదిని సందర్శించి మంచాలను రెండు భాగాలుగా చేసి గదిలోకి గాలి, వెలుతురు వచ్చేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని, దానికి ప్రపంచాన్ని మార్చే శక్తి ఉందన్నారు. విద్యార్థులు బాగా చదివి జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. సెప్టిక్ ట్యాంక్ క్లియరెన్స్ కోసం బడ్జెట్ అంచనా రిపోర్ట్ పంపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ సెక్రటరీ హనుమంతు నాయక్, డీసీఓ సాయిలత తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: మైసిగండి మైసమ్మ తల్లి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మైసమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మైసిగండి మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, జవహర్‌లాల్, మహేందర్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, వెంకటేశ్, యాదగిరిస్వామి, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే కారును చుట్టుముట్టిన కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యేకు చేదు అనుభవం

- కాలె యాదయ్య కారుపై కోడిగుడ్లు, టమాటాలు, వాటర్ బాటిళ్లతో దాడి
- గంటకు పైగా కారులోనే కూర్చున్న కాలె
- తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని కాంగ్రెస్ శ్రేణుల మండిపాటు

షాబాద్: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు చేదు అనుభవం ఎదురైంది. షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఆయన వాహనంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోడిగుడ్లు, టమాటాలు, వాటర్‌బాటిళ్లతో దాడి చేశారు. ఎమ్మెల్యే డౌన్‌డౌన్, యాదయ్య గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వాహనానికి అడ్డంగా కూర్చుని ధర్నా నిర్వహించారు. అధికారం లేకపోయినా పదేళ్లుగా పార్టీలో ఉంటూ కష్టపడిన తమకు ప్రాధాన్యం దక్కడం లేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ నాయకులను వెంటేసుకుని తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశానికి ఎమ్మెల్యే వస్తున్నాడని ముందుగానే తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు ముందస్తు ప్లాన్ ప్రకారం దాడికి పాల్పడ్డారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే మండలంలోని కాంగ్రెస్‌కు చెందిన ఓ వర్గాన్ని దూరం పెట్టారని ఆరోపించారు. తమ బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. తాము ఎమ్మెల్యేకు వ్యతిరేకం కాదని, పార్టీ శ్రేణుల పట్ల ఆయన అనుసరిస్తున్న విధానాలకు మాత్రమే వ్యతిరేకమని నినాదాలు చేశారు. ఇదే సమయంలో అక్కడకు వచ్చిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌పై పలువురు కార్యకర్తలు దాడికి దిగారు. దీంతో పోలీసులు ఆయన్ను అక్కడి నుంచి పంపించారు. ఎట్టకేలకు సీఐ కాంతారెడ్డి, సీనియర్ నాయకుడు తమ్మలి రవీందర్ కల్పించుకుని ఎమ్మెల్యేతో మాట్లాడిస్తామని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు. అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య కార్యాలయంలోకి వెళ్లిన యాదయ్య లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఓడిపోయిన భీంభరత్ మద్దతుదారులను.. పార్టీలో చేరిన ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే దాడి జరిగినట్లు భావిస్తున్నారు. ఈ ఘటనలో 25 మంది కాంగ్రెస్ శ్రేణులతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కాంతారావు తెలిపారు.



నాయకులను నచ్చచెబుతున్న పోలీసులు

సంబురంగా ఉట్ల పండుగ



చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద స్వామివారి ఊరేగింపు

మొయినాబాద్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని చిలుకూరు బాలాజీ ఆలయంలో బుధవారం ఉట్ల పండుగ నిర్వహించారు. మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద ప్రతీ సంవత్సరం కృష్ణాష్టమి తరువాత రోజు ఉట్ల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం స్వామివారిని ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం ఎదుట ఉట్లు కొట్టారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ కృష్ణాష్టమి, ఉట్ల పండుగ విశిష్టతను భక్తులకు వివరించారు. వేడుకల్లో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చైర్మన్ గిరి.. నేతల గురి

- పరిగి మార్కెట్ చైర్మన్ పదవి కోసం పలువురి ప్రయత్నాలు
- ఎమ్మెల్యే వద్దకు ఆశావహులు



పరిగి మార్కెట్ కమిటీ కార్యాలయం

పరిగి: పరిగి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు నేతలు పావులు కదుపుతున్నారు. పాలక వర్గం పదవీ కాలం ముగియడం, గత ప్రభుత్వం కొత్త చైర్మన్లను నియమించకపోవడంతో ఆశావహులు నిరుత్సాహానికి గురయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరడంతో ఆ పార్టీ నేతలు చైర్మన్ గిరిపై దృష్టి సారించారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి వద్దకు క్యూ కడుతున్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీకి రిజర్వేషన్ రావడంతో ఈ సారి జనరల్ వస్తుందని, ఆ సామాజిక వర్గం నాయకులు పైరవీలు ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో పరిగి, కుల్కచర్ల మార్కెట్ యార్డులు ఉండగా పరిగి మార్కెట్ యార్డు పెద్దది. దీంతో చుట్టుపక్కల మండలాలు అయిన దోమ, పూడూరు నాయకులు సైతం చైర్మన్ పదవి కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎవరికి వారు ప్రయత్నాలు

పరిగి మార్కెట్ చైర్మన్ పదవి ఈసారి జనరల్ వస్తుందని నేతలు భావిస్తున్నారు. దీంతో పదవి కోసం ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రధానంగా కొన్ని పేర్లు తెరపైకి వస్తున్నాయి. పరిగి పట్టణ కేంద్రానికి చెందిన కృష్ణారెడ్డి తాను ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండనని నామినేటెడ్ పదవి అయిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి కూడా చైర్మన్ రేసులో ఉన్నారు. ఆయన కూడా ఎమ్మెల్యేతో మంతనాలు జరుపుతున్నారు. అదే బాటలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కౌన్సిలర్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ నాయకులు పలాద్రీ శ్రీనివాస్, కడ్మూర్ శ్రీను, నస్కల్ అశోక్, మంచన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి, రఘు మోహన్‌రెడ్డి, చిన్న నర్సింహులు పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో కృష్ణారెడ్డి, పరశురాంరెడ్డి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరో వైపు పరిగి మండలానికి చైర్మన్ పదవి ఇస్తే దోమ మండలానికి వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని ఆ ప్రాంత నాయకులు కోరుతున్నారు. సీనియర్ నాయకుడు నాచారం శాంత్‌కుమార్ రేస్‌లో ఉన్నట్లు సమాచారం. ఆశావహుల్లో అవకాశం ఎవరికి దక్కుతుందో మరి కొన్ని రోజులు వేచి చూడాల్సి ఉంది.

రాజకీయంగా ఎదగాలని

రాజకీయంగా ఎదగాలన్నా, జిల్లా వ్యాప్తంగా పేరు రావాలన్నా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఉండాలని పలువురు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేసేందుకు తాము సిద్ధంగా లేమని, నామినేటెడ్ పోస్టులు ఇస్తే తీసుకుంటామని అంటున్నారు. గతంలో ఎస్సీ రిజర్వేషన్ ఉండటంతో ఈ సారి జనరల్ వస్తుందని, దీంతో పోటీ కూడా ఎక్కువగా ఉంటుందని నాయకులు అంచనాకు వచ్చారు. అటు ఓసీలతోపాటు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు కూడా తమ రాజకీయ భవిష్యత్ కోసం స్థానిక ఎమ్మెల్యేతో నిత్యం టచ్‌లో ఉండి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెంది ఓ నాయకుడు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అలాగే ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేసే అభ్యర్థులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ముందే మాట ఇస్తున్నట్లు సమాచారం.

పీఏసీఎస్ గోదాం రెడీ

- రూ.60 లక్షల నాబార్డు నిధులతో నిర్మాణం
- రాయితీపై రైతులకు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

యాచారం: రైతులకు సేవలందించేందుకు పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ప్రత్యేక గోదాం సిద్ధమైంది. రూ.60లక్షల నాబార్డు నిధులతో ఈ గిడ్డంగిని నిర్మించారు. గతంలో ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన భవనంలోనే పీఏసీఎస్ సేవలందించడంతో పాటుగా గోదాం సైతం అదే భవనంలో కొనసాగేది. ఇరుకైన భవనంలో ఇబ్బందులు తలెత్తడంతో 2017లో రూ.40లక్షల నాబార్డు నిధులు వెచ్చించి పీఏసీఎస్ భవనం నిర్మించి రైతులకు సేవలు అందిస్తున్నారు. పాత పీఏసీఎస్ భవనంలోనే రైతులకు ఎరువులు, విత్తనాలు అందజేశారు. రైతుల భవిష్యత్ అవసరాల దృష్ట్యా నూతన గిడ్డంది నిర్మించారు. త్వరలోనే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య చేతుల మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించేందుకు పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, సీఈఓ నాగరాజు పనులు చేపడుతునారు.

రూ.కోటి నిధులతో నిర్వహణ

యాచారం పీఏసీఎస్ పరిధిలో మండలంలోని 24గ్రామాల నుంచి ఐదు వేలకు పైగా సభ్యులున్నారు. 3,500 మంది పైగా రైతులు స్వల్పకాలిక, దీర్ఘకాలిక, బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందారు. మరో 250మందికి పైగా వ్యక్తిగత రుణాలు తీసుకున్నారు. గతంలో భవనం ఇరుకుగా ఉండడంతో ప్రతీ సంవత్సరం రూ.30లక్షల ఎరువులు, రూ.15లక్షల విత్తనాలు రైతులకు విక్రయించేవారు. నూతన గోదాం అందుబాటులోకి వస్తే రూ.కోటికిపైగా నిధులు వెచ్చించి ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

'సీఎస్‌సీ' ఏర్పాటుకు ఓకే

నూతనంగా ప్రారంభించిన గోదాం పై అంతస్తులో ఒక గదిలో సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్)ను ఏర్పాటు చేసేందుకు గాను పీఏసీఎస్ అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే డీసీసీబీ నుంచి అనుమతులు సైతం మంజూరయ్యాయి. ఈ సెంటర్ ప్రారంభంతో రైతులకు బ్యాంకింగ్, ట్రావెల్స్, ఇతర సేవలు అందించనున్నారు. పీఏసీఎస్‌లో సభ్యులుగా ఉన్న రైతులంతా సీఎస్‌సీ సెంటర్‌లోనే అన్ని రకాల సేవలు పొందేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు తక్కువ ఫీజులతో అన్ని రకాల సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారు. సీఎస్‌సీ సెంటర్‌లో సిబ్బంది నియామకానికి పీఏసీఎస్ నుంచి డీసీసీబీ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.



యాచారంలో నిర్మించిన నూతన గోదాం

క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సమావేశంలో సైంటిస్టులు, రైతులు

అనంతగిరి: ప్రతి రైతు తప్పకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు సుధా, హెన్మప్పగౌడ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో సస్యరక్షణపై రైతు వేదికలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో వరి పంటలను పరిశీలించారు. ఈ దశలో పంటపై వచ్చే చీడపీడలను ఎప్పటికప్పుడు పరిశీలించి వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వరి పంటపై వచ్చే శిలీంధ్ర తెగులకు నివారణగా విత్తన శుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ స్వరూప, ఏఓ జ్యోతి, ఏఈఓ అయ్యప్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ నిర్ధారణలో అధికారులు



అంగడిచిట్టంపల్లిలో రైతు ఇంటి వద్ద వ్యవసాయ అధికారులు

పూడూరు: అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి తులసీరాం అన్నారు. బుధవారం మండల పరిధిలోని చన్గోముల్, పోతిరెడ్డిగూడ, అంగడిచిట్టంపల్లి గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి నిర్ధారణ చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో రైతుల ఇంటిపేరు, బ్యాంకు ఖాతాలో పేర్లు, కుటుంబ సభ్యుల వివరాలను దరఖాస్తు ద్వారా స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈఓలు ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో ఉడాయించిన భర్త

పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య



హరీశ్వర్ (ఫైల్)

బషీరాబాద్: బ్యాంకులో నగదు జమ చేస్తానని భార్యను నమ్మించి రూ.15 లక్షలతో పరారయ్యాడో ఓ భర్త. భార్య ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలంలోని కంసాన్‌పల్లి(ఎం) గ్రామానికి చెందిన దండోతి హరీశ్వర్, దండోతి అనురాధ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. హైదరాబాద్‌లో హరీశ్వర్ టాక్సీ నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. అప్పుల భారంతో సొంతూరులోని ఎకరం పొలాన్ని ఈ మధ్యే రూ.21.50 లక్షలకు విక్రయించాడు. అందులో అప్పులు, ఇతర ఖర్చులు పోనూ ఇంట్లో రూ.15 లక్షలు ఉంచాడు. ఈ నెల 23న ఇంట్లో డబ్బును భార్య పేరున బ్యాంకులో జమ చేస్తానని హరీశ్వర్ బయటకు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అదే సమయంలో తాండూరులో ఉంటున్న అనురాధ అక్క స్వరూప సైతం ఇంటి నుంచి వెళ్లిపోయి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుంది. దీంతో వారిద్దరూ కలిసి పారిపోయారని ఇరు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. గతంలోనూ వీరు సన్నిహితంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు అనురాధ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో వైపు స్వరూప భర్త శాంతు తాండూరు గ్రామీణ పోలీసులను ఆశ్రయించాడు. రెండు ఠాణాల్లో మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు.

గ్రామీణం.. క్రీడకు దూరం!

భారత క్రీడాకారులకు పరిచయం అక్కర్లేని పేరు ధ్యాన్‌చంద్. ఈ హాకీ మాంత్రికుడి అద్భుత ప్రతిభతో దేశానికి ఎన్నో పతకాలను సాధించి పెట్టారు. ఏటా ఆయన జయంతిని(ఆగస్టు 29) జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో గ్రామీణ బాల, బాలికలు క్రీడల వైపు వెళ్లాలని విశ్లేషకులు భావిస్తున్నారు.



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

ఆటలతో మానసిక, శారీరక దృఢత్వం

- పలు అధ్యయనాల వెల్లడి
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

దుద్యాల్: క్రీడలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఎన్నో అధ్యయనాలు వెల్లడించాయి. అంతేకాకుండా నిరంతర సాధన, ప్రతిభ ఆటగాడి సొంతమైతే దేశం గర్వించదగ్గ పతకాలెన్నో సాధించవచ్చు. మన దేశంలో ప్రస్తుతం క్రీడలంటే క్రికెట్‌గా మారిపోయింది. ఏ ఆటకు దక్కని ప్రాధాన్యం ఒక్క క్రీడకే లభిస్తోంది. అందుకే ఇటీవల ఒలంపిక్స్ పతకాల వేటలో భారత్ చివరన నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో బాల, బాలికలకు సైతం ఆటల వైపు కన్నెత్తి చూడడం లేదు. వారికి చిన్నప్పటి నుంచే సరైన శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తే అన్ని క్రీడల్లో అద్భుత ఫలితాలు ఆశించవచ్చు. హాకీ, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్ తదితర క్రీడలకు తర్ఫీదు ఇవ్వాలని స్పోర్ట్స్ ప్రేమికులు కోరుతున్నారు. గ్రామీణులు సైతం తమ పిల్లలను ఆటల వైపు వెళ్లేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

మెరుగైన ఆరోగ్యం

శరీరం ఆరోగ్యంగా, దృఢంగా ఉండాలంటే క్రీడలు చాలా ముఖ్యం. క్రీడలతో మానసిక, శారీరక వృద్ధి మెరుగవుతుంది. రోజువారి జీవనంలో కలిగే ఒత్తిళ్లను అధిగమించడానికి క్రీడలు ఉపయోగపడతాయి. బీపీ, షుగర్, ఉబ్బకాయం తదితర బారిన పడకుండా కాపాడుకోవచ్చు. శరీరంలో రక్త ప్రసరణ సక్రమంగా ఉండి జీవ ప్రక్రియ బాగుంటుది. మెదడు చురుకుగా పని చేయడానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయి. పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు అత్యంత ముఖ్యమైనవి. పరీక్షల సమయంలో ఒత్తిడిని తట్టుకోవడానికి ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి చదువులో అద్భుత ఫలితాలు సాధించడానికి వారధిగా క్రీడలు నిలుస్తాయి. అందుకే క్లాసులు జరిగే సమయంలో ఆటల కోసం ప్రత్యేక పిరియడ్ కేటాయిస్తారు.



ధ్యాన్‌చంద్

పాఠశాల నుంచే..



విద్యార్థి ఏదో ఒక ఆటలో మక్కువ పెంచుకుని పాఠశాల స్థాయి నుంచే రాణించాలి. క్రీడలతో జీవితాంతం మంచి ఆరోగ్యాన్ని సంపాదించుకోవచ్చు. శరీరంలో ఉన్న ఇతర ఆరోగ్య సమస్యలు క్రీడల ద్వారా దూరమవుతాయి. క్రీడల్లో రాణిస్తే మన పరిసరాల్లో మంచి గుర్తింపు వస్తుంది.

– సాయికిరణ్, హస్నాబాద్, జాతీయ అథ్లెటిక్

కృషి చేస్తున్నా



క్రీడలతో విద్యార్థులు దృఢంగా తయారవడంతోపాటు విద్యను అభ్యసించడంలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అందుకే విద్యాశాఖ పాఠశాలలో ప్రతి తరగతికి ఒక పిరియడ్‌ను కేటాయించి వారికి క్రీడలపై శిక్షణ ఇస్తోంది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో విద్యార్థులు రాణించేలా కృషి చేస్తున్నాం.

– అనిల్, పీడీ, జెడ్పీహెచ్‌ఎస్, హస్నాబాద్

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

జిల్లా కేంద్రానికి తరలిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



కొడంగల్ విద్యా వనరుల కేంద్రం ఎదుట నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కొడంగల్ రూరల్: విద్యాశాఖలో పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని విద్యా వనరుల కేంద్రం ఎదుట వారు నిరసనలు వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో ఆందోళన చేయడానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. గతేడాది సెప్టెంబర్‌లో 40 రోజులుగా చేపట్టిన దీక్షల సందర్భంగా పీసీసీ హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ ధర్నా శిబిరంలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించి, కనీస వేతనం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు రాఘవేందర్, శ్రీనివాస్, శంకరయ్య, వేణుగోపాల్, నాగరాజ్, వెంకట్రావు, కృష్ణ, దస్తప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గొర్ల మందను ఢీకొన్న డీసీఎం

ప్రమాదంలో కాపరితో పాటు 8 జీవాలు మృత్యువాత



గాయపడిన ఆంజనేయులును ఆస్పత్రికి తరలిస్తున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో గొర్ల కాపరి ఆంజనేయులుతో పాటు 8 జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు సమీపంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ మండలం హన్మాన్‌పల్లి గ్రామానికి చెందిన గొర్ల కాపరి ఆంజనేయులు తన గొర్ల మందతో కోనాపూర్ నుంచి ఆమనగల్లు వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడగా.. గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. అదే సమయంలో నాగర్‌కర్నూల్ నుంచి నగరానికి వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్.. కాపరిని చికిత్స నిమిత్తం ఆటోలో ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ వెంకటేశ్ పరిశీలించి, వివరాలు సేకరించారు. ఆంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొబైల్ వైద్యం అందుబాటులో ఉంచాలి

ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు: హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆమనగల్లు, కడ్తాల, కల్వకుర్తి పట్టణాలలో మొబైల్ వైద్య సదుపాయం అందుబాటులో ఉంచాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ సూచించారు. ప్రతి ఆస్పత్రి వద్ద అంబులెన్స్ సౌకర్యం ఉంచాలన్నారు. బుధవారం ఆయన ఆమనగల్లులో మాట్లాడుతూ.. మండలంలోని కోనాపూర్ గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి ఆంజనేయులు మృతి చెందడం బాధాకరమన్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులును ఆమనగల్లు ఆస్పత్రికి తరలించడానికి 108కి ఫోన్ చేసినప్పటికీ అంబులెన్స్ రాలేదన్నారు. అటుగా వెళుతున్న తాను స్థానికుల సాయంతో ఆంజనేయులును ఆమనగల్లుకు తీసుకువచ్చినప్పటికీ కాపాడలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అంబులెన్స్ వచ్చి ఉంటే ఆయన బతికేవాడన్నారు. రహదారిని విస్తరించి, డివైడర్ ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వాస్పత్రి భవనాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి రోగులకు వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పత్యానాయక్, కుమార్, రమేశ్, వెంకట్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న వెంకటేశం

జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చీఫ్ అడ్వకేట్ వెంకటేశం

ధారూరు: దేశంలో బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చీఫ్ అడ్వకేట్ వెంకటేశం పేర్కొన్నారు. బుధవారం సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. పిల్లల సమస్యలపై ఉచితంగా కోర్టులో కేసులు వాదిస్తామన్నారు. చదువుకునే వయసులో పిల్లలకు పెళ్లిళ్లు చేస్తే వారిలో అనేక సమస్యలు వస్తాయన్నారు. దేశంలో రోజుకు 4 వేల వరకు బాల్య వివాహాలు జరుగుతున్నట్లు గణంకాలు చెబుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం సీఐ రామకృష్ణ మాట్లాడుతూ.. బాల్య వివాహాలను నిరోధించడం మన సామాజిక బాధ్యతన్నారు. బాల్య వివాహాలు చేయరాదని, వివాహ వయసు వచ్చాకే చేయాలని సూచించారు. బాల్య వివాహాలు జరిగినప్పుడు 1098, 100 నంబర్లకు వెంటనే కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాజిదాబేగం, సాధన స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకుడు సీహెచ్ రాహుల్, ఎస్‌ఐ వేణుగోపాల్ రెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



జనార్దన్ (ఫైల్)

కేశంపేట: విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల పరిధిలోని సంతపూర్ గ్రామానికి చెందిన బిజారం జనార్దన్ (40) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. జనార్దన్ మంగళవారం కొత్తపేట గ్రామానికి చెందిన గొల్లపల్లి చెన్నయ్యతో కలిసి పాటిగడ్డ గ్రామ శివారులో విద్యుత్ పనులు చేసేందుకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ స్తంభానికి వైర్లు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే గాయపడిన జనార్దన్‌ను 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని సాయికృష్ణ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడి మృతి



మృతుడు ప్రమోద్

కేశంపేట: జీవితంపై విరక్తి చెంది యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేముల నర్వ గ్రామంలో గంజాయి జంగయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. ఇతడికి కుమారుడితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు ప్రమోద్(30) ఆరేళ్ల క్రితం మహేశ్వరం గ్రామానికి చెందిన కృపను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారి జీవనం మూడు సంవత్సరాలు సాఫీగా సాగిన తరువాత గొడవలు మొదలయ్యాయి. ఈ గొడవలు భరించలేక నాలుగు నెలల క్రితం కృప తల్లిగారింటికి వెళ్లింది. దీంతో ప్రతిరోజు భార్యతో ఫోన్‌లో గొడవ పడేవాడని గ్రామస్తులు తెలిపారు. రోజు మాదిరిగా మంగళవారం రాత్రి కూడా భార్యభర్తలు ఫోన్‌లో గొడవ పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గొడవ అనంతరం మృతుడు ఇంటి పక్కన గుడిసెలో నిద్రించినట్లు, ఉదయం నిద్ర లేవకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూశారు. అప్పటికే ప్రమోద్ గుడిసెలో పైకప్పుకు ఉరి వేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



కొందుర్గు: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆగిర్యాలలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలకిష్టయ్య తన ఆవును మంపొలం వద్ద కట్టేశాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ విద్యుత్ స్తంభం విరిగి పడి ఆవు మృతి చెందింది.

రుణమాఫీ చేసేందుకు సిద్ధం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రూ.2 లక్షల్లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, బ్యాంకు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీ అమలులో లబ్ధిదారులకు సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలు, రుణాల రెన్యువల్ తేదీల్లో తప్పులు దొర్లినట్లయితే సంబంధిత ఖాతాలను అధికారులు వెంటనే సరిచేసి ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. అదేవిధంగా బ్యాంకు అధికారులు రైతుల రుణాలకు సంబంధించిన జాబితాను తయారు చేయాలని సూచించారు. మాఫీ కాని రైతులను గుర్తించి వెంటనే రుణమాఫీ అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే వాటిని పరిష్కరించేందుకు వ్యవసాయ, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతు భరోసా పేరుతో ప్రత్యేక యాప్‌ను రూపొందించారన్నారు. అధికారులు వివరాలను నమోదు చేస్తే ఉన్నతాధికారులు పరిశీలించి రుణమాఫీ చేస్తారని తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



సాత్విక్‌రెడ్డి (ఫైల్)

శంకర్‌పల్లి: విద్యార్థి అదృశ్యమైన సంఘటన బుధవారం శంకర్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురం గ్రామానికి చెందిన జి సాత్విక్‌రెడ్డి (14) పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏనిమిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం రాత్రి అందరితో కలిసి భోజనం చేసిన తర్వాత నిద్రించిన అతను ఉదయం 4.30 గంటలకు స్కూల్ డ్రెస్ వేసుకొని, బ్యాగులో రెండు జతల బట్టలు, కొంత నగదు తీసుకొని బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు ఇంటి చుట్టు పక్కల, బయట సీసీ కెమెరాలో వెతికారు. 5.15కి శంకర్‌పల్లిలో పటాన్‌చెరు బస్సు ఎక్కినట్లు తెలుసుకున్నారు. పటాన్‌చెరులోని ఓ టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేసే వరకు సీసీ కెమెరాల దృశ్యాలు లభించాయి. తర్వాత ఎటు వైపు వెళ్లిన విషయం తెలియలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు కాపురంపై బెంగ

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య



ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: కుమార్తె కాపురంపై బెంగ పెట్టుకొని ఓ తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద సంఘటన బుధవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన సిద్దిపేట ప్రభాకర్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయన రెండో కూతురు విడాకులు తీసుకుని కొంత కాలంగా పుట్టింట్లోనే ఉంటోంది. ఈమె కొడుకు ఎవరి వద్ద ఉండాలనే విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. దీంతో మనవడు దూరమవుతాడేమో అని ప్రభాకర్‌రెడ్డి(60) మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చి, అంజిరెడ్డి వెంచర్‌లోని కంటైనర్‌కు ఉరేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అండాలు జిల్లెలగూడలో బీజేపీ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిపోయారు. బిడ్డ కాపురంపై మనోవేదనకు గురి కావడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు అండాలు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు సీఐ వివరించారు.

పశుపోషణలో జాగ్రత్తే రక్ష

- సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం
- సకాలంలో స్పందిస్తే వ్యాధుల నివారణ సులభం
- పశువైద్యాధికారి, భానునాయక్, కడ్తాల్



కడ్తాల్: వర్షాకాలంలో పశువులు, జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు, పశుపోషకులు అప్రమత్తంగా ఉండి, సరైన సమయంలో స్పందిస్తే తప్పనిసరిగా మంచి ఫలితాలు ఉంటాయని వెటర్నరీ అధికారి భానునాయక్ సూచించారు. వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను చేపట్టినవారు అధిక పాల ఉత్పత్తి కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన పచ్చిగడ్డితో పాటు దాణా, మినరల్ మిక్చర్‌ను అందిస్తే ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరుతుందని భానునాయక్ సూచించారు.

ప్రశ్న: పశువులకు వచ్చే వ్యాధుల పట్ల, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: పాడి పశువులకు, వచ్చే వ్యాధుల పట్ల రైతులు తగు జాగ్రత్త వహించాలి. జబ్బవాపు, గాలికుంటు, గొంతు వాపు, పొదుగువాపు వ్యాధులు వచ్చే అవకాశాలుంటాయి. ప్రధానంగా పాడిపశువు సంకభాగంలో, పొదుగు వద్ద సోకుతుందని, దీంతో పాలు పితకడానికి ఇబ్బందులు కలుగుతాయి.

రైతులు వెంటనే రోగాన్ని గుర్తించి పశువైద్యుడిని సంప్రదించి, టీకాలు వేయించాలని సూచించారు. కాళ్ల పగులు జలుబు, నోటిగుండా జొల్లు కారడం, జ్వరం, కుంటుతూ నడవడం, మేతమేయక పోవడం లాంటి లక్షణాలు ఉంటే, గాలికుంటు వ్యాధి లక్షణాలుగా గుర్తించి, వైద్యుడిని సంప్రదించి ముందస్తుగా చికిత్స చేయించాలి.

ప్రశ్న: పశువులలో పాలజ్వరం ఎందుకు వస్తుంది, నివారణకు తీసుకోవలసిన చర్యలేవి?

జవాబు: పాడిపశువులు ఈనిన కొత్తలో పాలజ్వరం వస్తుంది. శరీరంలో కాల్షియం నిల్వలు తగ్గినప్పుడు దీని బారిన పడతాయి. వాటి లక్షణాలు శరీరం చల్లబడి పాడిపశువులు తలను డొక్కలో పెట్టుకుని, చలనం లేకుండా కదిలించిన కదులకుండా ఉంటాయి. కాల్షియం బోరోగ్లూకోనెట్, ద్రవం తగిన మోతాదులో పశువు రక్తంలో ఎక్కించాలి.

ప్రశ్న: పాడిపశువులకు గోమారి, పేను, పిడుదులు పట్టకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: పశువుల పాకను పరిశుభ్రంగా ఉంచాలి. తరచూ ఫినాయిల్‌తో పాకను శుభ్రం చేయాలి. పరిశుభ్రంగా లేకపోతే సూక్ష్మజీవులు పాడిపశువుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. గోమారిపేను సోకకుండా, పశువుల మూతికి బుట్టకట్టి, పశువుల పాకలో బూటాక్స్‌లేదా, అమిత్రాజ్ చల్లాలి. అదేవిధంగా పశువుల శరీరంపై చల్లి కాసేపు ఎండలో ఉంచాలి. అనంతరం అరగంట తర్వాత శుభ్రమైన నీటితో పశువులను కడగాలి.

ప్రశ్న: పశువుల షెడ్డులో తరచూ ఇబ్బంది పెట్టే దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

జవాబు: సాధరణంగా రైతులు తమ వ్యవసాయపొలాల్లో లభించే, అయిల్‌ఆకులతో రోజు పొగపెట్టాలి. షెడ్డులో తడిగా ఉండకుండా పేడ, మూత్రం లేకుండా చూడాలి.

ప్రశ్న: పశువులకు మినరల్ మిక్చర్ ఎంతవేయాలి. ఎప్పుడు వేయాలి?

జవాబు: పశువులకు పెట్టే దాణలో గాని, కుడితిలో గాని మినరల్ మిక్చర్ ప్రతి రోజు 40నుంచి, 50 గ్రాములు తినిపించాలి. మినరల్ మిక్చర్‌లో కాల్షియం, పాస్పరస్, ఐడిన్, మెగ్నిషీయం, కోబాల్ట్, కాపర్, మాంగనీస్ వంటి లవణాలుంటాయి. పశువుకు దీన్ని అందించడం ద్వారా పశువులకు ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు, అధికంగా పాలు ఇస్తాయి.

ప్రశ్న: బీరు కల్లి పశువులకు పెట్టడం ఉపయోగకరమేనా?

జవాబు: బీరు కల్లి ఉపయోగించడం ద్వారా పశువులకు భవిష్యత్తులో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. రైతులు సాధ్యమైనంత వరకు పశువులకు పచ్చిగడ్డి, ఎండుగడ్డితో పాటు సమీకృత దాణతో పాటు, మినరల్ మిక్చర్ అందించాలి.

ప్రశ్న: పశువులకు వ్యాధులు రాకుండా మీరిచ్చే సలహ ఏంటి?

జవాబు: పశువుల పాక శుభ్రంగా ఉంచడంతో పాటు, దాణ, నీరు, కలుషితం కాకుండా చూడాలి. పరిశుభ్రమైన నీరు తాగించాలి. తడిసిన కుళ్లిన గడ్డిని తినిపించరాదు. నాణ్యతతో కూడిన పచ్చిగడ్డి, చొప్ప పశుగ్రాసంగా వేస్తే అధిక లాభాలు సాధించవచ్చు.